సాక్షి
శ్రీకాకుళం

శనివారం, 11, మార్చి, 2023



'పొట్ట'కొట్టే పురుగు

రబీ వరికి చీడపీడలు ఆశిస్తున్నాయి. తెల్లకం కులు నివారించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - IIలో



వాతావ'రణం'

పగలు ఉక్క, రాత్రి చలితో సిక్కోలు వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ పరిస్థితి అనారోగ్యాలు తెచ్చి పెడుతోంది. - IIలో

విద్యార్థులకు అందుబాటులో హాల్ టిక్కెట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ చెప్పారు. పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 11 నుంచి 13 వరకు డ్రై డే

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాసన మండలి ఎన్నికల సందర్భంగా జిల్లాలో 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు డ్రై డేగా ప్రకటించామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో అన్ని మద్యం దుకాణాలు మూసివేయాలని తెలిపారు. ఈ నెల 16న కౌంటింగ్ రోజున కూడా మూసివేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో దేవదాయశాఖ ప్రభుత్వ సలహాదారు



ఆదిత్యుని జ్ఞాపికను శ్రీకాంత్‌కు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర దేవదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. శాఖాపరంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపడుతోందని శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సంఘ ప్రతినిధులు యామిజాల గాయత్రి, రాజసాయిమనోహర్, ప్రకాష్, దుర్గాప్రసాద్ తదితరులు శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'సావిత్రీబాయి పూలే ఆదర్శప్రాయురాలు'



సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసిన బీసీ సంఘ నాయకులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సావిత్రీ బాయి పూలే నేటి మహిళలకు ఆదర్శప్రాయురాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి అన్నారు. సావిత్రీ బాయి పూలే 126వ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళంలోని జ్యోతిరావు పూలే పార్కులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చంద్రపతి మాట్లాడుతూ దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, చదువుల తల్లిగా గుర్తింపు పొందిన వ్యక్తి సావిత్రి అని తెలిపారు. కార్యక్రమంలో బాడాన దేవభూషణ్, సంఘ నాయకులు మెట్ట రామారావు, కంఠ వేణు, ఆతవ ఉదయ్‌భాస్కర్, గుంట మంజుల, కర్రి రంగాజీదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం



ఉపాధి హామీ కూలీలతో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు

శ్రీకాకుళం రూరల్: సమాన పనికి సమాన వేతనం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు అన్నారు. మండల పరిధిలోని తండేవలస, ఎస్ఎస్‌వలస పంచాయతీ పరిధిలోని చెరువులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయట పనులకు వెళ్తే మగవారికి, ఆడవారికి కూలీలో వ్యత్యాసం ఉంటుందన్నారు. అదే ఉపాధి హామీ పథకంలో మాత్రం సమాన పనికి సమాన వేతనం లభిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా స్థానికంగా ఉపాధి దొరకడమే కాకుండా గ్రామాల్లో సుస్థిర వనరులను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. వ్యవసాయ ఆయకట్టు స్థిరీకరణ, చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆహార ఉత్పత్తులు పెరగడం, భూగర్భ జలమట్టం పెంపొందించడం వంటివి జరుగుతాయన్నారు. రెండు పూటలా పనిచేయడం ద్వారా గరిష్ట వేతనాన్ని పొందాలని, వంద రోజులు పనిదినాలు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



● విద్యుత్ శాఖలో
అవినీతి చిరంజీవి!

- రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టుల్లో గుత్తాధిపత్యం!
- కొర్రీలతో ఇతరులకు నో ఎంట్రీ
- కమిషన్లు దండుకుని ఇతరులకు పనులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఈపీడీసీఎల్‌లో 'పవర్' గేమ్ నడుస్తోంది. ఓ కాంట్రాక్టర్ రెండు దశాబ్దాలుగా ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చున్నాడు. కొత్తవాళ్లను అడ్డుకుంటూ తన స్థానాన్ని కాపాడుకుంటున్నాడు. ఇప్పుడు ఆ బాగోతం బట్టబయలవుతోంది. 20 ఏళ్ల గుత్తాధిపత్యంపై అసంతృప్తి గళాలు వినిపిస్తుండడంతో ఈ వ్యవహారం వెలుగు చూస్తోంది. అక్కడున్న లొసుగులు, అవకతవకలు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. దీంతో కొత్త కాంట్రాక్టర్లకు నో ఎంట్రీ అంటూ ఆయన జాగ్రత్త పడుతున్నాడు. కొత్తగా ప్రయత్నిస్తున్న వారిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడు. కొత్త వారికి సహకరిస్తారన్న అనుమానంతో ఎమ్మెల్యేలపైన, వారి దగ్గర పీఏలుగా పనిచేస్తున్న వారిపై ఆరోపణలు చేసి వ్యవహారాన్ని పక్కదారి పట్టిస్తున్నాడు.

ఈపీడీసీఎల్‌లో పాత విద్యుత్ స్తంభాలను మార్చడం, కొత్త స్తంభాలు వేయడం, పాత లైన్లు తొలగించి కొత్త లైను వేయడం, వ్యవసాయ కనెక్షన్ల కోసం విద్యుత్ స్తంభాలు, లైన్లు వేయడం వంటి పనులు జరుగుతుంటాయి. వీటిని కాంట్రాక్టుకు అప్పగిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా పనులు అన్నీ ఒకే కాంట్రాక్టర్‌కు వెళ్లడంపై ఆరోపణలు ఉన్నాయి. క్లాస్ 5 నుంచి క్లాస్ 1 కాంట్రాక్టర్ వరకు ఆ పనులు చేయవచ్చు. కాకపోతే కేటగిరీ వారీగా పనుల పరిమితి ఉంటుంది. కానీ ఇక్కడ ఏ ప్రాతిపదికన కట్టబెడుతున్నారో తెలియదు గానీ 20 ఏళ్లుగా ఒకే కాంట్రాక్ట్ వ్యవస్థ కొనసాగుతోంది. అక్కడ తిష్ట వేసి అన్నీ పనులు వారే దక్కించుకుంటున్నారు.



అనుభవం పేరుతో..

శ్రీకాకుళానికి చెందిన గొద్దు చిరంజీవులు ఈపీడీసీఎల్‌లో గుత్తాధిపత్యం నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం మండలాలతో పాటు ఉర్లాం సబ్ స్టేషన్ పనులు నిర్వహిస్తున్నారు. అనుభవం పేరుతో పనులు దక్కించుకుని వాటిని వేరొక వ్యక్తులతో చేయిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. అధికారులను సైతం శాసించే స్థాయికి వెళ్లిపోయారు. అధికారులు సైతం ఆయన చెప్పు చేతుల్లో ఉండేలా, తన మాటే వినేలా అజమాయిషీ ప్రదర్శిస్తున్నారు. కొత్త మెటీరియల్ కొనుగోలు చేసినట్టు బిల్లులు సృష్టించి పాత మెటీరియలే వినియోగిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. జలుమూరు–పాతపట్నం స్టేట్ హైవే పనుల్లో ఈయన చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు ఉన్నాయి.

కొత్త వారు వద్దే వద్దంటూ..

అంతా తానై ఏకఛత్రాధిపత్యం చెలాయిస్తున్న చిరంజీవులకు.. కొత్తగా కాంట్రాక్ట్ కోసం కొందరు ప్రయత్నం చేస్తుండటంతో ఎక్కడ లేని కోపం వచ్చేసింది. జరుగుతున్న పరిణామాలను గమనించి అనుభవం లేని వారికి ఇక్కడ ప్రవేశం లేదని అడ్డుకుంటున్నారు. ఎవరికైనా ఒకసారి అవకాశం కల్పిస్తే కదా అనుభవం అనేది వస్తుంది. క్లాస్ కాంట్రాక్టరా? కాదా? అన్నదే చూడాలి తప్ప అనుభవం పేరుతో కొత్తవాళ్లను అడ్డుకోవడమేంటని వాదన తెరపైకి వచ్చేసింది. దీంతో కొత్తగా రావాలని చూస్తున్న కాంట్రాక్టర్లను ఎలా అడ్డుకోవాలన్నదానిపై దృష్టి పెట్టాడు. ఏదోలా బురద జల్లేసి, వారికి సంబంధీకులు, తెలిసిన వాళ్లు ఎవరున్నారో తెలుసుకుని, వారిపై ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని ఆరాటపడుతున్నాడు. ఇందులో భాగంగా మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పేషీపై విమర్శలు గుప్పించాడు. అంతేకాకుండా కొత్త కాంట్రాక్టర్లపై పరిశీలన చేస్తున్న ఈపీడీసీఎల్ అధికారులపైన ఫిర్యాదులకు దిగాడు. ఇప్పుడీ వ్యవహారం ఈపీడీసీఎల్‌లో రచ్చ రచ్చగా మారింది.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి: ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: విద్యుత్ పనులను కాంట్రాక్టు పద్ధతిలో చేపట్టే కాంట్రాక్టర్ తన పీఏ మురళీపై చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఘాటుగా స్పందించారు. విద్యుత్ శాఖ కాంట్రాక్టు పనులపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ చేయాలని సంబంధిత అధికారులను రాతపూర్వకంగా కోరినట్లు కృష్ణదాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పచ్చమీడియా కక్ష సాధింపులో భాగంగానే తనపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోపణలు చేసిన కాంట్రాక్టర్ వాటిని నిరూపించలేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

కిరణ దర్శనానికి మబ్బులు అడ్డం



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రెండో రోజు కిరణ దర్శనానికి ఆకాశంలో మబ్బులు అడ్డంగా ఉండడంతో కిరణాలు గర్భాలయానికి చేరుకోలేదు. శుక్రవారం ఉదయం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు కిరణ దర్శనానికి వేచిచూసినప్పటికీ నిరాశ తప్పలేదు. మళ్లీ ఈ ఏడాది అక్టోబర్ 1,2 తేదీల్లోనే కిరణ దర్శనం ఉంటుందని ఆలయ ప్రధానార్చకులు శంకరశర్మ తెలియజేశారు.

సమయం లేదు మిత్రమా..



కంబైన్డ్ స్టడీస్‌కు టైమొచ్చింది. నైట్ అవుట్లు చేసే అవసరం కనిపిస్తోంది. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ముంచుకొస్తున్నాయి. ఏడాదంతా ఎంత కష్టపడినా పరీక్షల ముందు రివిజన్ చేసుకుంటేనే ఆ కష్టానికి ప్రతిఫలం దక్కుతుంది. ఇలాంటి కీలక సమయంలో అనవసర ఒత్తిళ్లకు గురై కాలాన్ని వృథా చేసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు. మొబైల్ గేమ్స్, సోషల్ మీడియా పోస్టులు, కొత్త సినిమా కబుర్లు, క్రికెట్ మ్యాచ్ విశ్లేషణలు వంటి టైమ్‌పాస్ పనులు పరీక్షల తర్వాతైనా చేసుకోవచ్చని, ఇప్పుడు మాత్రం ఉన్న ఈ కొద్ది సమయాన్ని సంపూర్ణంగా సమర్థంగా వాడుకోవాలని సూచిస్తున్నారు.

- మార్చి 15 నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు
- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ ఫలితాలపై సర్కారు ప్రత్యేక ఫోకస్
- విద్యార్థులు ఒత్తిడికి గురి కాకూడదంటున్న విద్యా వేత్తలు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థి లోకం పరీక్షలకు సిద్ధమవుతోంది. ఒక వైపు అధికారులు మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ అమలు చేస్తుండగా.. విద్యార్థులు కూడా పూర్తిస్థాయిలో ఎగ్జామ్స్‌కు సిద్ధమవుతున్నారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా పునశ్చరణ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. బడులు, కాలేజీల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు తీసుకుంటున్నారు.

15 నుంచి ఇంటర్, 3 నుంచి టెన్త్ పరీక్షలు..



జిల్లాలో మార్చి 15వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, టెన్త్‌క్లాస్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు 109 కేంద్రాల్లో జరగనుండగా.. ఈ పరీక్షలకు 57,122 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ఫస్టియర్ 29,589 మంది, సెకెండియర్ 27,533 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29,575 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ పరీక్షలకు ఇంటర్మీడియెట్ బోర్డు, విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలపై సూచనలు కూడా చేస్తున్నారు.

ఎంత టైమ్ ఇస్తున్నారు..?



సమయాన్ని ఎంత తెలివిగా వాడుకుంటే అంత ఎక్కువ స్కోర్ చేయవచ్చు. సబ్జెక్టులు, టాపిక్ ప్రాధాన్యతలను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయింపు చేసుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు స్వల్ప విరామం ఇవ్వడం వల్ల మెదడుపై ఒత్తిడి తగ్గుతుందని విశ్రాంత ప్రిన్సిపాల్ పేడాడ రాంబాబు చెబుతున్నారు.



పుస్తకాలతో కుస్తీపడుతున్న విద్యార్థులు

'రివిజన్' కీలకం మర్చిపోవద్దు..

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని ప్రశ్నలపై ఎక్కువగా దృష్టిపెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఎంత బాగా నేర్చుకున్న సమాధానాలైనా కొన్నిరోజులకు మర్చిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యార్థులు నేర్చుకున్న ప్రశ్న సమాధానాలను కూడా తరచూ రివిజన్ చేస్తుండాలి. ఇంటర్ పరీక్షలకు గట్టిగా కేవలం వారం రోజుల వ్యవధి మాత్రమే ఉంది. అన్ని పాఠశాలల్లో టెన్త్ సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ ఎంతో కీలకమని శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య వెల్లడిస్తున్నారు.

ఆరోగ్యంగా ఉండాలి..

ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. అందువల్ల ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ప్రొటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. అలాగే తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా కొద్ది సమయం వ్యాయామం చేయాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ సునీల్ నాయక్ సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలి.

ఇవి తప్పనిసరి..

- పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి. కొత్త అంశాల జోలికి వెళ్లకూడదు.
- టైమ్ టేబుల్ సిద్ధం చేసుకుని, అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా చూసుకోవాలి.
- కాస్త కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి. పరీక్షల సమయంలో క్విక్ రివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.
- పాత ప్రశ్న పత్రాలు, మోడల్ ప్రశ్నపత్రాలను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. బయట, హోటల్స్ ఫుడ్ తీసుకోకపోవడం మంచిది.
- ప్రశాంతంగా రోజుకి 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి.
- పూర్తి పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండాలి. ఎవరి మాటలకు తలొగ్గకూడదు. ఒత్తిడికి గురికాకూడదు.
- పరీక్షలు ముగిసే వరకు మరీ ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

ఒత్తిడి వద్దు



పిల్లలు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. మార్కుల గురించి టెన్షన్ వద్దు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. రివిజన్ పదేపదే చేస్తుండాలి. వెనుకబడిన సబ్జెక్టులు/టాపిక్‌లపై ఎక్కువ ఫోకస్ చేయాలి. ఒత్తిడిని జయించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు చేస్తుండాలి. మార్కులకు దోహదం చేసే చక్కటి చేతిరాతపైనా దృష్టి పెట్టాలి.

– బలివాడ మల్లేశ్వరరావు, విద్యారంగనిపుణులు, విశ్రాంత డీఈఓ

మెరుగైన ఫలితాలను సాధించేందుకు..



సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. భయపడకుండా పరీక్ష రాసేలా పాఠశాలల్లో నిపుణులు, టీచర్లతో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– గార పగడాలమ్మ, డీఈఓ, శ్రీకాకుళం

'వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపిద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

రణస్థలం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన సీతంరాజు సుధాకర్, నర్తు రామారావులను గెలిపించుకుందామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రణస్థలం మండలం బంటుపల్లి సమీపంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబుతో కలిసి సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ఐఆర్‌ఏడీ యాప్‌పై అవగాహన



కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ (ఐఆర్‌ఏడి) మొబైల్ యాప్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ ఆదేశానుసారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనురాధ, ఆరోగ్యశ్రీ సమన్వయ అధికారి డాక్టర్ పి.ప్రకాశరావు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రైవేటు ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురుకుల విద్య సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో అందిస్తున్న గురుకుల విద్యను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు అన్నారు. ఆయన గురుకుల పాఠశాలలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 2023–23 విద్యా సంవత్సరాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని అన్నారు. 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులు 3, 4 తరగతులు వరుసగా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు సంస్థల్లో చదివి ఉండాలని చెప్పారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలు పొందే విద్యార్థులు 9, 10 తరగతులు వరుసగా ప్రభుత్వ, గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో చదివి ఉండాలని అన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 24లోపు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ:ఎస్//ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటలు వ రకు, ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్ష 23న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలు వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

'కళాశాల ప్రగతికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జానకి రామయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: పూర్వపు విద్యార్థులు కళాశాల ప్రగతికి కృషి చేయాలని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకి రామయ్య అన్నారు. కళాశాలలో పూర్వపు విద్యార్థుల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. పూర్వపు విద్యార్థులు అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాల పూర్వపు విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ అధికారులు, వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలుగా ఉన్నారని చెప్పారు. కళాశాల ప్రగతికి కృషి చేయాలని అన్నారు. 1970లో ఏర్పాటైన ఈ సంస్థ రాష్ట్రంలో ఉత్తమ విద్యాసంస్థగా ముందుకు సాగుతోందని అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు. పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ ఏర్పాటు చేయగా, అధ్యక్షులుగా దుప్పల వెంకటరావు, ఉపాధ్యక్షులుగా కూన వాసుదేవరావు, కార్యదర్శిగా కె.ఉమామహేశ్వర రావులను ఎన్నుకున్నారు.

రైతు 'పొట్ట' కొట్టే పురుగు



- రబీ వరిలో తెల్లకంకుల నివారణే కీలకం
- చిరు పొట్టదశలో వచ్చే చీడపీడలతో పంటపై తీవ్ర ప్రభావం
- ముందస్తు సస్యరక్షణతో మంచి దిగుబడులకు అవకాశం

పోలాకి: ఈ ఏడాది వంశధార కాలువల ద్వారా సాగునీరు ప్రణాళికాబద్ధంగా విడుదల చేయటమే కాకుండా నిర్వహణలోనూ అధికారులు శ్రద్ధ చూపడంతో రబీ పంట బీ రెడీ అన్నట్టు ఉంది. జిల్లా అంతటా ప్రస్తుతానికి రబీ సాగు ఆశాజనకంగా ఉంది. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లోని దాదాపు 10400 ఎకరాల వరకూ రబీ వరి సాగు చేస్తున్నారు. ఉద్దానం పరిసర ప్రాంతాల్లోనూ రబీ వరి సాగవుతోంది.

చీడపీడలు ఎక్కువే..

వేసవిలో తేలికపాటి రకాలైన ఆర్‌ఎస్‌ఆర్–15048 రకం వరిపంటనే రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. 125–130 రోజుల పంట కాలం గల ఈ సన్న రకం వరిని తెలంగాణసోనా అని కూడా పిలుస్తారు. స్థానికంగా సుగర్‌లెస్ ధాన్యం అని పిలిచే ఈ రకం పంటకు రబీలో చీడపీడల ఉద్ధృతి చాలా ఎక్కువ. ప్రస్తుతం 80 నుంచి 100 రోజుల మధ్యకాలంలో ఉన్న పంట చిరుపొట్ట నుంచి పొట్టదశలో ఉంది. ఆఖరి దఫా ఎరువు చల్లిన తరువాత వచ్చే కాండం తొలుచు పురుగుల నివారణకు సరైన సస్యరక్షణ చేయకపోతే తెల్లకంకి వచ్చి దిగుబడిపై దెబ్బతీసే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

- ముఖ్యంగా రబీవరి పంట శీతాకాలంలో నాట్లు వేయటం వల్ల మొక్క పెరుదల కాస్త నెమ్మదిగా వస్తుంది. దీంతో రైతులు విపరీతమైన నత్రజని ఎరువులను వినియోగిస్తుంటారు. అందువల్ల చీడపీడలు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. దీంతోపాటు వాతావరణంలో మార్పులతో క్రమంగా వేసవి కాలం ప్రారంభమవటం పగటిపూట ఉష్ణోగ్రతలు పెరగటం కూడా పురుగు ఉద్ధృతికి కారణమని చెబుతున్నారు.
- పంటలో పక్షులు ఎక్కువగా వాలితే ఆ పొలంలో తెల్లంకి పురుగు వ్యాప్తికి కారణమైన రెక్కలపురుగుతీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించవచ్చు. తెల్లకంకులు వచ్చిన తర్వాత వరిపంటలో ఎలాంటి నివారణలేని కారణంగా చిరుపొట్టదశలోనే ముందస్తు సస్యరక్షణ చర్యలతో తెల్లకంకులతో నష్టపోకుండా చేయవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మూడు సార్లు స్ప్రే చేశాను



వేసవి వరి పంటలో తెల్లకంకుల సమస్య చాలా ఎక్కువ. గత ఏడాది పంటలో పీకపోటుతో రైతులు చాలా వరకు నష్టపోయారు. ఎకరాకు సగటున 2 నుంచి 4 బస్తాల వరకు తీవ్రతను బట్టి నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. అందుకే ఈ ఏడాది మూడు దఫాలుగా పురుగు మందులు స్ప్రే చేశాను. ఇప్పటివరకు ఎలాంటి పురుగు ఆశించలేదు.

– ఇప్పిలి అప్పన్న, రైతు, ప్రియాగ్రహారం

సస్యరక్షణ చర్యలు అవసరం



రబీ వరిలో తెల్లకంకి నివారణకు చిరు పొట్టదశలోనే రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ముందస్తుగా క్లోరాంత్రనిప్రోల్ లేదా ఫ్లూబెండిమైడ్ లేదా కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ వంటి రసాయనాలను పిచికారీ చేయాలి. యూరియా వినియోగం కూడా విచక్షణా రహితంగా వినియోగించటం కూడా పురుగు కాండం తొలుచుపురుగు ఉద్ధృతికి ప్రధాన కారణం.

– పి.చిరంజీవి, వ్యవసాయశాఖ అధికారి, పోలాకి



కనిపెంచిన దేవుళ్లకు..

మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం రామరాజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఈ పాదపూజ ఏర్పాటు చేసినట్లు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రామరాజు తెలిపారు. – సారవకోట

ఆకాశవాణిలో రచయిత గౌరీశంకర్ రచన



గౌరీశంకర్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని తాను రచించిన 'రామాయణం.. సామాజికత' అనే రచనను ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ఎంపిక చేసిందని, సోమవారం రికార్డు చేయనున్నట్లు ప్రముఖ కథారచయిత భమిడిపాటి గౌరీశంకర్ తెలిపారు. దీన్ని రానున్న శ్రీరామ నవమికి ప్రసారం చేస్తారని తెలిపారు. ఈ విషయంపై ఆకాశవాణి అధికారుల నుంచి సమాచారం అందిందని తెలిపారు. ఈ రచనలో రామాయణం నాటి సమాజం, ధర్మం నేటికీ ఆచరణీయమనే అంశాన్ని వివరిస్తున్నట్లు తెలిపారు. ఈయన ప్రస్తుతం గాయత్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, హరకేష్, సదాశివుని కృష్ణ కేశ్వరరావు, రామజోగేశ్వరశర్మ, శివరామకృష్ణలు అభినందించారు.

'ఆధ్యాత్మిక చింతన అవసరం'

మందస: మానవ జన్మకు సార్థకత చేకూరాలంటే ఆధ్యాత్మిక చింతన ఉండాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ప్రధాన శిష్యులు త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. మందస పట్టణంలోని శ్రీవాసుదేవస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భక్తి చింతనతో పాటు సామాజిక హితవు కోరి ఉండాలన్నారు. మానవజన్మ సార్థకత చెందాలంటే పాపపు భీతి కలిగి ఉండాలని, మంచి చేయాలని కోరారు. స్వామి బ్రహ్మోత్సవాలు అనంతరం మళ్లీ వాసుదేవుని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

మందసలోని స్వామి ఆలయం నిత్యం భక్తులతో కళకళలాడుతూ ఉండాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆలయం అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా తీర్థగోష్టి నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, అర్చకులు అనిల్‌స్వామి, ఘనశ్యాం, వాసుదేవ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కూడా ఉన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

వాతావ'రణం'

- ఉష్ణోగ్రతల్లో భారీ తేడాలు
- పగలు ఉక్కబోత, రాత్రి వణుకు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు

హిరమండలం: ఇంకా వేసవి ఆరంభం కాలేదు. అలాగని చలికాలమూ అయిపోలేదు. ఈ సందిగ్ధ వాతావరణ పరిస్థితుల మధ్య సిక్కోలు వాసులు నలిగిపోతున్నారు. ఈ మధ్యన రాత్రి పూట ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. పగలు భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. వాతావరణంలో చోటుచేసుకున్న ఇలాంటి మార్పులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధ పడుతున్నారు. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. దీనికి తోడు ఉక్కబోత వేధిస్తోంది. మరోవైపు రాత్రి పూట చలి, ఉదయం పొగ మంచు పంజా విసురుతున్నాయి. ఈ విభిన్న వాతావరణంలో వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఇలాంటి సమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.



హిరమండలంలో నిర్మానుష్యంగా కనిపిస్తున్న అలికాం-బత్తిలి ప్రధాన రహదారి

ఆరోగ్య సూత్రాలు అవసరం



ఇప్పటి వాతావరణ పరిస్థితుల్లో వడదెబ్బ తగిలే అవకాశాలు కూడా ఉన్నాయి. ఎండల్లో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధులు బయట తిరగకపోవడమే మంచిది. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుని జాగ్రత్తలు పాటించాలి.

– సీహెచ్ సాయిగీత, పీహెచ్‌సీ వైద్యాధికారి హిరమండలం

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు తమ్మినైన అప్పలనాయుడు, తమ్మినైన వరప్రసాద్‌లు అదే గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌కు సుమారు రూ. 75 వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను వితరణగా అందించారు. గ్రామంలో ఉన్న ఇంటిని ప్రభుత్వ అవసరాలకు ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పాఠశాలకు ఎప్పుడు ఏ అవసరం ఉన్నా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	56,150–00
బంగారం(22క్యా. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

'నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయండి'

ఆమదాలవలస: ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ప్రగతి లక్ష్యాలను పూర్తి చేయాలని మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయం వెల్ఫేర్, ఎమినిటీస్ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, ఆర్పీలతో సమీక్షించారు. జగనన్న కాలనీ లే అవుట్ల పురోగతి, జగనన్న తోడు, పీఎం స్వానిధి దశలవారీ మంజూరు, రికవరీ, టిడ్కో రుణాల మంజూరు, పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. సిబ్బంది సేవల నవీకరణ జరగాలంటే నిర్దేశించిన ప్రగతి లక్ష్యాలను సాధించాలని తెలిపారు.

వివిధ పథకాల్లో లబ్ధిదారులకు నిరంతర అవగాహన కల్పించి ప్రభుత్వ సేవలు పొందేలా చైతన్యం కల్పించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలో పూండి-గోవిందపురం పంచాయతీ గూనాలపాడు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాలోని గంజాం జిల్లా రామచంద్రపల్లికి చెందిన భగవాన్‌దాస్(34) మృతి చెందారు. ఆయన ఒడిశా నుంచి వలస వచ్చి ఇక్కడే ఉంటున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా చీకటిపేట బ్లాక్ రామచంద్రపల్లికి చెందిన ముకుంద, పూర్ణిమాదాస్‌ల కుమారుడు భగవాన్‌దాస్. స్థానికంగా ఉన్న బంధువుల సహకారంతో బతుకు తెరవు కోసం ఏడాది కిందట పూండి సమీపంలోని గూనాలపాడు(ఉప్పరపేట)వచ్చాడు. అక్కడే పూండి–నౌపడ ప్రధాన రహదారి ఆనుకుని పాన్‌షాపు నడుపుతున్నాడు. అతనికి భార్య మోహినీదాస్, కుమారుడు లక్కీదాస్, కుమార్తె రోహినీదాస్‌లు ఉన్నారు. గూనాలపాడులోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో తన కుమారుడు లక్కీదాస్, కుమార్తె రోహినీ దాస్‌లను పూండిలోని ఓ ట్యూషన్ సెంటర్‌లో దించి వస్తుండగా.. పాతటెక్కలి వైపు నుంచి వస్తున్న కొబ్బరి కాయల లగేజీ వ్యాన్ భగవాన్‌దాస్ స్కూటీని బలంగా ఢీకొట్టింది. తల వెనుక భాగం నుంచి రక్తం ధారలై కారడంతో హుటాహుటిన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి అదుపు దాటడంతో పలాస తరలిస్తుండగా బెండిగేటు సమీపంలో ఆయన ఊపిరి వదిలేశాడు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కుటుంబ సభ్యుల రోదనలు అందరి చేత కంట తడి పెట్టించాయి. భార్య మోహినీదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. లగేజీ వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు.



ఘటనా స్థలిలో దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు



భగవాన్ దాస్(ఫైల్)

రైలు కింద పడి వృద్ధుడు మృతి

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన ఆధారాల మేరకు ఆయనను కోటబొమ్మాళి మండలం రాయిపాడు గ్రామానికి చెందిన కోట సింహాచలం(65)గా గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని చెప్పారు. పూండి రైల్వే స్టేషన్ మాస్టర్ చక్రవర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.



శవ పంచనామా చేస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో నాలుగు గొర్రెలు మృతి

నరసన్నపేట: మండలం గడ్డెయ్యపేట కూడలి వద్ద పర్లాకిమిడి రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా.. గొర్రెల కాపరి మునసలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సారవకోట మండలం గొల్లపేట, సత్రాంలకు చెందిన గొర్రెల కాపర్లు తమ గొర్రెలను రోడ్డుపై గురువారం రాత్రి తరలిస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం గొర్రెలతో పాటు కాపరి మునసలయ్యను బలంగా ఢీకొట్టింది. దీంతో మునసలయ్య కోమాలోకి వెళ్లిపోయారు. ఆయన శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై నరసన్నపేట ఏఎస్‌ఐ వైకుంఠరావు కేసు నమోదు చేశారు.

5 లీటర్ల నాటు సారా స్వాధీనం

పాతపట్నం: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పాతపట్నం మేజర్ పంచాయతీ నీలకంఠాపురానికి చెందిన చింతలపూడి జయరాం ఒడిశా నుంచి 5 లీటర్ల నాటు సారా తీసుకువస్తుండగా పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలుపుదల

పొందూరు: మండలంలోని తానెం గ్రామంలో బాల్య వివాహాన్ని రెవెన్యూ, పంచాయతీ, ఐసీడీఎస్ అధికారులు నిలుపుదల చేశారు. వధూవరుల కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేస్తే వచ్చే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సాయి, కార్యదర్శి నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.